
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక


వరంగల్ | మంగళవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 32 | జనవరి 06, 2026 | వెల : రూ.3-00



సర్వభ్రష్ట బీఆర్ఎస్

4లో..

# నీళ్ల లొల్లి!



**'పాలమూరు-రంగారెడ్డి'పై మాటల యుద్ధం**
**కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ**

- ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న తెలంగాణ రాజకీయం
- సీఎం వివాదాస్పద వ్యాఖ్యలతో సిచ్యుయేషన్ సీరియస్
- కేసీఆర్ సైతం యుద్ధం తప్పదంటూ వ్యాఖ్య
- తగ్గేదేలే అంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు
- ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు త్వరలో బీఆర్ఎస్ భారీ సభ
- బీఆర్ఎస్ అవినీతిపై దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించే అవకాశాలు?

3లో..

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో :**

తెలంగాణలో ఏళ్ల తరబడి కరువు కోరల్లో చిక్కుకుని, వలసల జిల్లాగా ముద్రపడ్డ పాలమూరు గుండె గొంతుక ఇప్పుడు రాజకీయ రణక్షేత్రమైంది. ఒకప్పుడు సాగునీటి లేమితో తల్లడిల్లిన ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం.. కానీ, నేడు ఆ ప్రాజెక్టు చుట్టూ నీళ్లు కాదు.. రాజకీయ నిప్పులు రాజుకుంటున్నాయి. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన వైఫల్యాల అస్త్రం ఒకవైపు.. చేతగానితనం మీదే అంటూ గులాబీ దళపతి కేసీఆర్ గర్జన మరోవైపు..

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సర్కార్ కు ఎదురుదెబ్బ

- హరీష్ రావు విచారణకు అనుమతి కోరిన ప్రభుత్వం
- అనుమతి నిరాకరించిన సుప్రీం కోర్ట్



**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**

ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో కీలక ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ నేత హరీష్ రావును విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా తిరస్కరించింది. హరీష్ రావు విచారణకు అనుమతించాలంటూ

మిగతా 3వ పేజీలో..

## అసెంబ్లీలో మేడారం సందడి


- మహా జాతర పోస్టర్ ఆవిష్కరణ
- సీఎం రేవంత్ రెడ్డికి అధికారిక ఆహ్వానం
- రూ.230 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు

3లో..



## బీఆర్ఎస్‌కు కవిత రాంరాం..!

### పదవికి రాజీనామా చేసిన కల్వకుంట్ల కవిత



- తెలంగాణ జాగృతితో ఇక కొత్త పోరు
- భావోద్వేగంతో మండలిలో కన్నీటి పర్యంతం
- బీఆర్ఎస్ పై ఘాటైన ఆరోపణలు
- నన్ను పార్టీలో అణగదొక్కారు..
- అవినీతిని ప్రశ్నించినందుకు దూరం పెట్టారు..
- బీఆర్ఎస్, పార్టీ పెద్దలపై సంచలన వ్యాఖ్యలు
- 2029 లక్ష్యంగా ముందుకెళ్తామన్న జాగృతి అధ్యక్షురాలు

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కనీవినీ ఎరుగని సంచలనం నమోదైంది. మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన సొంత గూడు భారత రాష్ట్ర సమితిపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. సోమవారం శాసనమండలి వేదికగా ఆమె కన్నీటి పర్యంతమవుతూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని, తనను ఘోరంగా అవమానించారని ఆరోపిస్తూ.. తెలంగాణ జాగృతిని ఒక రాజకీయ శక్తిగా మారుస్తున్నట్లు వెల్లడించి రాజకీయ ప్రకంపనలు సృష్టించారు.

**మండలిలో కన్నీటి వీడ్కోలు..**

శాసనమండలిలో తన చివరి ప్రసంగం చేస్తూ కవిత

మిగతా 3వ పేజీలో..

## తెలంగాణలో జనసేన కమిటీలు రద్దు

- తాత్కాలిక కమిటీల నియామకం
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం
- అధికారికంగా ప్రకటించిన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో నిపలు కమిటీలను రద్దు చేసి, వాటి స్థానంలో

మిగతా 3వ పేజీలో..

## రిజిస్ట్రేషన్ సేవలకు కొత్త రూపం

- ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నిర్మాణం
- మూడు దశల్లో 94 కార్యాలయాలకు శాశ్వత భవనాలు
- స్లాట్ బుకింగ్‌తో 21 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

3లో..



వేద న్యూస్

మంగళవారం జనవరి 06, 2026

- ☐ మట్టెవాడలో సర్వే నం.442లో అక్రమ నిర్మాణం..!
- ☐అనుమతులు రద్దు చేయాలని కోరుతున్న కొత్తవాడ ప్రజలు
- ☐ ఉన్నతాధికారులకు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లేఖలు
- ☐ అక్రమార్కుల ఆట కట్టించి తగు చర్యలు తీసుకోవాలని జనం వేడుకోలు

# పోరుబాట

## ప్రభుత్వ భూమి పరి'రక్షణ'కు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసిన అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలని, సర్కారీ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ కొత్తవాడ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు ఇప్పటికే శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లేఖలు రాశారు. వివరాల్లోకెళితే..గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలోని మట్టెవాడ గ్రామంలోని సర్వే నంబర్.442లోని భూమి ప్రభుత్వ భూమిగా తహశీల్దార్ నిర్ధారణ చేశారు. ఇక్కడ ఎలాంటి నిర్మాణం చేయ కూడదని ఆక్రమణదారును ఆదేశించారు. అయినా ఆక్రమణదారు పట్టించు కోకుండా నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు భవన నిర్మాణ అనుమతి నం.306234/జీడబ్ల్యూఎంసీ/4129/2023 తేదీ.11-07-2023 ను రద్దు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సదరు నిర్మాణం జరుగుతున్న ల్యాండ్ ప్రభుత్వ భూమిగా వరంగల్ జిల్లా కోర్టు వారు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన జడ్జిమెంట్ కాపీతో పాటు తహశీల్దార్ జారీ చేసిన పహాణీ పత్రాలను అధికారులకు జనం అందజేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

# వరంగల్ భూకొలతదారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ జిల్లా అనుమతి పొందిన భూకొలతదారుల 2025 సంఘం ఎన్నికలు న్యాయ సలహాదారులు గోనె విజయ్ రెడ్డి, బర్ల పూర్ణచందర్ పర్యవేక్షణలో రంగశాయిపేటలో జరిగాయి. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా దేవునూరి రాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రంగు శివ, ఉపాధ్యక్షుడిగా జినికిరి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా గజవెల్లి ప్రదీప్, వరంగల్ విభాగం సమన్వయకర్తగా మామిడాల సాయి రామ్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా బొమ్మెర రమ, మరుపట్ల ఏకాంబరం, కోశాధికారిగా ధర్మసోత్ కిరణ్, సలహాదారుగా ఆవునూరి శివ కుమార్, మహిళా విభాగం సమన్వయకర్తగా బలుగురి దీపిక, నర్సంపేట విభాగం సమన్వయకర్తగా పెంతల విష్ణు ఏకగ్రీవంగా ఎన్నికవగా, పదమూడు మండలాలకు పదమూడు మంది సమన్వయకర్తలు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నిక అనంతరం దేవునూరి రాజు మాట్లాడుతూ త్వరలో డెబ్బై గ్రామాల్లో పునః భూకొలతలు నిర్వహిస్తామని, ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తామని తెలిపారు. సభ్యులందరూ ఐకమత్యంతో సాగుతూ భూకొలతదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

# వీరబాబు కు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



**వేద న్యూస్, మరిపెడ:**

గత కొద్ది రోజుల క్రితం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన బాసిపంగు వీరబాబు రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మరిపెడ మున్సిపాలిటీ ఎస్టీ సెల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బాలాజీ నాయక్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పానుగోతు వెంకన్న, వెంకు రవి తదితరులు వీరబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, పార్టీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల పరామర్శకు వీరబాబు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పశువులకు నట్టల మందు పంపిణీ



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బోడగట్టు గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, పశు సంవర్ధక శాఖ సహకారంతో ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం మెదక్ డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో, డాక్టర్ సౌమ్య, టేక్మాల్ డాక్టర్ నాగరాజు పాల్గొని విజయవంతంగా నిర్వహించారు. శిబిరంలో డాక్టర్లు మాట్లాడుతూ.. పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. నట్టల మందుల వినియోగం, శుభ్రత, పోషకాహారం వంటి అంశాలపై కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పట్లోలా భూంరెడ్డి స్వయంగా పశువులకు నట్టల మందు వేస్తూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెవీవో హనుమంతు, గోపాలమిత్ర సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, గోపాలమిత్రలు డి. రవీందర్, ఎం. దీపక్ కుమార్, ్. దేవరాజ్, గోపాలమిత్ర జిల్లా అధ్యక్షుడు పి. మల్లేశం గౌడ్, హాస్పిటల్ సిబ్బంది ఆనంద్‌తో పాటు పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.

# భార్య కాపురానికి రావడం లేదని..

## - సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్చల్



**వేద న్యూస్, రుద్రూర్:**

భార్య కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతోనే ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్చల్ చేశాడు. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన చాకలి రాజు అనే యువకుడు సోమవారం సాయంత్రం సెల్ టవర్ ఎక్కి కలకలం రేపాడు. ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, ఎస్సై సాయన్న తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని యువకుడిని సముదాయించారు. పోలీసుల చొరవతో యువకుడు సురక్షితంగా సెల్ టవర్ నుంచి కిందకు దిగాడు. తదనంతరం పోలీసులు యువకుడిని విచారించగా, భార్య కాపురానికి రావడం లేదన్న మనస్తాపంతోనే సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు ఆయన తెలిపినట్టు పోలీసులు వెల్లడించారు. అనంతరం యువకుడిని పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి, అవసరమైన కౌన్సెలింగ్ మరియు తదుపరి చర్యలు చేపట్టారు

# ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



**వేద న్యూస్, మెదక్:**

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, వివాదాలు, పోలీసు సంబంధిత ఇబ్బందులను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావుకు నేరుగా వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఒక్కొక్క ఫిర్యాదుదారునితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్యలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే సంబంధిత సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, సబ్‌ఇన్స్‌పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. కొన్నిచోట్ల సంబంధిత ఎస్హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ తెలిపారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడం తమ ప్రధాన బాధ్యత అని, పోలీస్ వ్యవస్థ ప్రజల కోసం ఉందని స్పష్టం చేశారు. ఎవరి జోక్యం లేకుండా నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని, ఇప్పటికే ప్రజావాణి ద్వారా పరిష్కారమైన అనేక కేసులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచాయని ఎస్పీ పేర్కొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో సామూహిక సీమంతాలు



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్ 1,2, 5 లో సోమవారం గర్భిణులు, బాలింతలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు మెంబర్లు హాజరయ్యారు. అనంతరం సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, వార్డు మెంబర్లకు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మ, రూప, ప్రతిమ, హెల్త్ సూపర్వైజర్ సుమతి, గౌరీ, శిరీష, ఆశా వర్కర్లు, గర్భిణీ బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలి

## - అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి




**వేద న్యూస్, అల్లాదుర్గ్:**

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఆదేశాల మేరకు నేషనల్ రోడ్ సేఫ్టీ మంత్‌లో భాగంగా అల్లాదుర్గ్ నేషనల్ హైవే అండర్‌పాస్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రేణుక రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ కట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం ప్రమాదకరమని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చని స్పష్టం చేశారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించి వచ్చిన వాహనదారులను శాలువాలతో సత్కరించి, అందరూ హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని వివరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారి తీస్తుందని సీఐ హెచ్చరించారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో మందమర్రి విద్యార్థుల ప్రతిభ



**వేద న్యూస్, మందమర్రి:**

6వ రాష్ట్రస్థాయి కుంపు, కరాటే పోటీలలో మందమర్రి పట్టణానికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు కైవసం చేసుకున్నారని మాస్టర్ జెట్టి కృష్ణ, అసిస్టెంట్ మాస్టర్ హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ మాస్టర్ మాటా ్డుతూ.. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి కుంపు, కరాటే పోటీల్లో మందమర్రి నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వీరిలో పలువురు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించి పట్టణానికి మంచి పేరు తెచ్చారని చెప్పారు. పిల్లలకు చదువుతో పాటు శరీర దృఢత్వం కోసం కుంపు, కరాటే, వ్యాయామం వంటి క్రీడలు ఎంతో అవసరమని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇలాంటి క్రీడలకు ప్రోత్సహిస్తే వారు మరింత చురుకుగా, ఆత్మవిశ్వాసంతో ఎదుగుతారని పేర్కొన్నారు.

# యూరియా యాప్‌పై రైతుల సంతృప్తి

## - ఏఓ రుషేంద్ర మణి




**వేద న్యూస్, దామరచర్ల:**

యూరియా యాప్ ద్వారా యూరియా తీసుకున్న రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని దామరచర్ల మండల వ్యవసాయ అధికారి రుషేంద్ర మణి అన్నారు. సోమవారం దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలో కలిసి యాప్ వినియోగంపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూరియా యాప్‌పై రైతుల్లో అవగాహన గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. యాప్ ద్వారా ఇప్పటికే అనేక మంది రైతులు సులభంగా యూరియా బుక్ చేసుకుని తీసుకుంటున్నారని, దీనిపై రైతులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. యాప్‌ను మరింత మంది రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకుని, అదే రోజే పొందవచ్చని వివరించారు. యూరియా కోసం గంటల తరబడి ఎరువుల దుకాణాల వద్ద నిలబడాల్సిన అవసరం ఉండదని, దీంతో రైతుల సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. యాప్ ద్వారా బుక్ చేసుకున్న రైతులను ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా, డీలర్లు ప్రభుత్వ ధరలకే యూరియాను విక్రయించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పార్వతి, ప్రియాంకతో పాటు రైతులు వెంకటేశ్వర్లు, పరశురాము, మాలోత్తు బాషా, రమేష్, మంగత తదితరులు పాల్గొన్నారు.



# నీళ్ల లొల్లి!

- 'పాలమూరు-రంగారెడ్డి'పై మాటల యుద్ధం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ



- ☐ ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న తెలంగాణ రాజకీయం
- ☐ సీఎం వివాదాస్పద వ్యాఖ్యలతో సిచ్యుయేషన్ సీరియస్
- ☐ కేసీఆర్ సైతం యుద్ధం తప్పదంటూ వ్యాఖ్య
- ☐ తగ్గేదేలే అంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు
- ☐ ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు త్వరలో బీఆర్ఎస్ భారీ సభ
- ☐ బీఆర్ఎస్ అవినీతిపై దర్యాప్తునకు ప్రభుత్వం ఆదేశించే అవకాశాలు?

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలు ఏళ్ల తరబడి కరవు కోరల్లో చిక్కుకున్న ప్రాంతాలు. సాగునీటి లేమితో వలసలు, ఎండిపోయిన పంటలు, తాగునీటి సమస్యలు ఈ ప్రాంత ప్రజలకు నిత్య గాథ. ఈ నేపథ్యంలోనే కృష్ణా జలాలను ఎత్తిపోసి పాలమూరుకు తరలించే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రూపకల్పన జరిగింది. కాగా, తెలంగాణలో రాజకీయం ఇప్పుడు ఇదే 'నీళ్ల' చుట్టూ తిరుగుతోంది. దశాబ్దాల కల అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అధికార, ప్రతిపక్షాల మధ్య అగ్గి రాజేసింది. గత పదేళ్లలో జరిగిన పాలనపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా తీవ్ర ఆరోపణలు చేయగా, ప్రస్తుత ప్రభుత్వం చేతగాని తనం వల్ల ప్రాజెక్టు ఆగబోతోందని మాజీ సీఎం కేసీఆర్ మండిపడ్డారు. ఈ క్రమంలో ఈ వివాదం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ సాగునీటి రంగంలో అత్యంత కీలకమైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రస్తుతం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య జల యుద్ధం నడుస్తోంది. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టగా, బయట బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**– ఉరి తీసినా తప్పులేదంటూ..**

ఇటీవల అసెంబ్లీలో సుదీర్ఘంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టును ఏ విధంగా పక్కదారి పట్టించిందో వివరించారు.. 'రీ-డిజైనింగ్ కాదు.. కమిషన్ల కోసమే మార్పు..' అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు కేసీఆర్ చేసిన ద్రోహాన్ని వివరిస్తూ.. ఆయన సంతకాలు తెలంగాణ రైతులకు మరణ శాసనాలని, కసబ్‌లాంటి వ్యక్తులకు కూడా శిక్ష పడిందని, ఈ పాపానికి వీరిని ఉరితీసినా తప్పులేదని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి తప్పించుకోవడానికి ఇది కేవలం తాగునీటి ప్రాజెక్టు అని, 7.15 టీఎంసీలు మాత్రమే వాడతామని కోర్టులో అఫిడవిట్ వేసి రైతులను మోసం చేశారని మండిపడ్డారు.

**– ప్రాజెక్టును అడ్డుకుంటే సహించం.. కేసీఆర్ గర్జన**

ఇటీవల తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో కేసీఆర్ కాంగ్రెస్ తీరుపై విరుచుకుపడ్డారు. మేము 90 శాతం పనులు పూర్తి చేసి ఇస్తే, ఏడాది కాలంలో కనీసం తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. డీపీఆర్ ను కేంద్రం వెనక్కి పంపినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించి, కాంగ్రెస్ చేస్తున్న ద్రోహాన్ని ఎండగడతామని హెచ్చరించారు. 'మేము ఓపికగా ఉన్నాం.. కానీ ఇక యుద్ధం తప్పదు' అని పిలుపునిచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మెప్పు పొందేందుకే రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తున్నారని కేటీఆర్, హరీష్ రావు ఆరోపించారు.

**– తగ్గేదే లేదంటున్న ఇరుపక్షాలు**

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కేవలం నీటి సమస్యగానే కాక, రెండు పార్టీల మధ్య అస్తిత్వ పోరాటంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వారు కావడంతో, ఈ ప్రాజెక్టు ఆలస్యానికి కేసీఆరే కారణమని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అటు బీఆర్ఎస్ సైతం 'పాలమూరును కాపాడుకుందాం' అనే నినాదంతో క్షేత్రస్థాయిలోకి వెళ్తోంది. 'కాంగ్రెస్ హయాంలోనే పాలమూరు వలసల జిల్లాగా మారింది.. మేము ప్రాజెక్టులు కడితే కాంగ్రెస్ అడ్డుపడుతోంది' అని బీఆర్ఎస్ అంటుంటే.. 'బీఆర్ఎస్ పాలనలో పాలమూరు నిధులు కాళేశ్వరానికి మళ్లించి జిల్లాకు ద్రోహం చేశారు' అని కాంగ్రెస్ ప్రతిదాడి చేస్తోంది. ఈ క్రమంలో ఇరు పార్టీల మధ్య సాగుతున్న 'మాటల యుద్ధం' సోషల్ మీడియా నుంచి వీధుల వరకు చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఇప్పటికే ప్రాజెక్టు సోర్స్ పాయింట్ మార్పుపై అంతర్గత విచారణ ప్రారంభించారు. ఒకవేళ విచారణలో అవకతవకలు తేలితే కాళేశ్వరం తరహాలో పాలమూరుపై కూడా విచారణ కమిషన్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. మరోవైపు కేసీఆర్ ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతుండటంతో రాబోయే రోజుల్లో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కనుంది.

**– త్వరలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ?**

ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే దిశగా బీఆర్ఎస్ ఇక మాటలకే పరిమితం కాకుండా ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అంశాన్ని కేంద్రంగా చేసుకుని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టే వ్యూహంలో భాగంగా పాలమూరు జిల్లాలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోంది. ఈ సభ ద్వారా ప్రాజెక్టు పనుల ఆలస్యం, నిధుల నిర్వహణ, రైతులకు నీళ్లు అందకపోవడంపై ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ముఖ్యంగా పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్వయంగా రంగంలోకి దిగే అవకాశం ఉందన్న చర్చ ఊపందుకోగా, సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు రాజకీయంగానే కాదు, ప్రజా ఉద్యమ రూపంలోనూ సమాధానం చెప్పాలన్నది బీఆర్ఎస్ లక్ష్యంగా తెలుస్తోంది. పాలమూరు నుంచే ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక ఇవ్వాలన్న ఆలోచనతో ఈ బహిరంగ సభను రాష్ట్రస్థాయి రాజకీయ ఈవెంట్‌గా మార్చే ప్రయత్నంలో పార్టీ నాయకత్వం ఉన్నట్లు సమాచారం.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సర్కార్ కు ఎదురుదెబ్బ

రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, ఆ విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. దీంతో ఈ దశలో హరీష్ రావును విచారించేందుకు అనుమతి లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ పరిణామంతో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో తెలంగాణ ప్రభుత్వానికి గట్టి న్యాయపరమైన అడ్డంకి ఎదురైంది. కోర్టు తీర్పుతో కేసు దిశపై రాజకీయ, న్యాయ వర్గాల్లో విస్తృత చర్చ మొదలైంది. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం తదుపరి న్యాయపరమైన చర్యలపై సమీక్ష చేయనున్నట్లు సమాచారం. మరోవైపు, సుప్రీం కోర్టు నిర్ణయం రాజకీయంగా కూడా కీలకంగా మారింది.

## బీఆర్ఎస్‌కు కవిత రాంరాం..!

భావోద్వేగానికి లోనయ్యారు. 'పార్టీలో ప్రశ్నిస్తే నాపై కక్షగట్టారు.. ఎనిమిదేళ్లుగా స్వేచ్ఛ లేకుండా, ఆంక్షల మధ్య పనిచేశాను.. ఇది కేవలం నా ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటం..' అని ఆమె స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో తాను జైలుకు వెళ్లినప్పుడు పార్టీ కనీసం అండగా నిలవలేదని, కేసీఆర్‌పై కోపంతో బీజేపీ తనను ఇబ్బంది పెడుతుంటే బీఆర్ఎస్ నాయకత్వం మౌనంగా ఉండిపోయిందని వాపోయారు.

**అవినీతిని ప్రశ్నించినందుకే దూరం..**

బీఆర్ఎస్ హయాంలో జరిగిన నిర్మాణాలపై కవిత సంచలన ఆరోపణలు చేశారు. 'అంబేద్కర్ విగ్రహం నుంచి అమరజ్యోతి నిర్మాణం వరకు ప్రతి దాంట్లో అక్రమాలు జరిగాయి.. వీటిని ప్రశ్నించినందుకే నన్ను రాజకీయంగా ఎదగకుండా అడ్డుకున్నారు' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన రాజకీయ ఎదుగుదలకు పార్టీ మౌత్‌పీస్‌లుగా ఉన్న పత్రికలు, టీవీ ఛానెళ్లు కూడా అడ్డంకులు సృష్టించాయని ఆమె పేర్కొన్నారు. ఇది ఆస్తుల పంచాయితీ కాదని, నైతికత లేని చోట తాను ఉండలేనని తెగేసి చెప్పారు.

**రాజకీయ శక్తిగా తెలంగాణ జాగృతి.. 2029 లక్ష్యం**

రాజీనామా అనంతరం గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళులర్పించిన కవిత, తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. తెలంగాణ జాగృతి ఇకపై ఒక రాజకీయ పార్టీగా అవతరిస్తుందని, 2029 ఎన్నికల్లో సత్తా చాటుతామని వెల్లడించారు. కాగా, కవిత ఈ సందర్భంగా ప్రజాస్వామ్యబద్ధంగా పని చేయాలనుకునే లెఫ్ట్ సోదరులు, మావోయిస్టు సానుభూతిపరులు తనతో కలిసి రావాలని కోరారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే సెక్యులర్ వేదికగా జాగృతి ఉంటుందని, యువత పిడికిలి బిగించి తనతో నడవాలన్నారు. ఆడబిడ్డల సహకారం ఉంటే గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతామని భరోసా ఇచ్చారు.

**బీఆర్ఎస్‌కు భారీ దెబ్బేనా?**

సొంత కుటుంబం నుంచే, అది కూడా కేసీఆర్ కుమార్తె నుంచే ఇన్ని ఘాటైన ఆరోపణలు రావడం బీఆర్ఎస్ పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. ముఖ్యంగా అవినీతి ఆరోపణలు, అంతర్గత ప్రజాస్వామ్యం లేదన్న విమర్శలు పార్టీ క్యాడర్‌లో గందరగోళానికి దారితీసే అవకాశం ఉంది. 2029 లక్ష్యంగా కవిత వేస్తున్న అడుగులు తెలంగాణలో మూడవ ప్రత్యామ్నాయ శక్తిగా మారుతాయా లేదా అన్నది వేచి చూడాలి.

## తెలంగాణలో జనసేన కమిటీలు రద్దు

తాత్కాలిక కమిటీలను నియమించనున్నారు. ఈ నిర్ణయంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కమిటీలు, వీరమహిళ విభాగం, యువజన విభాగం, విద్యార్థి విభాగ కమిటీలను రద్దు చేశారు. వాటి స్థానంలో కొంతమంది సభ్యులతో తాత్కాలిక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ తాత్కాలిక కమిటీలు ముప్పై రోజుల పాటు పనిచేస్తాయని పార్టీ వర్గాలు వెల్లడించాయి. తాత్కాలిక కమిటీ సభ్యులు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో, అలాగే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు వందల వార్డుల్లో పర్యటించనున్నారు. ప్రతి ప్రాంతం నుంచి కనీసం ఐదుగురు సభ్యులతో జాబితాను సిద్ధం చేసి పార్టీ కార్యాలయం దృష్టికి తీసుకురావడం వారి ప్రధాన బాధ్యతగా ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తైన అనంతరం పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేలా నూతన కమిటీలను ప్రకటిస్తామని జనసేన నాయకత్వం స్పష్టం చేసింది. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించారు

## అసెంబ్లీలో మేడారం సందడి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ శాసనసభలో ప్రపంచ ప్రఖ్యాత ఆదివాసీ ఉత్సవమైన మేడారం మహా జాతర సందడి నెలకొంది. జాతరకు సంబంధించిన పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాసనసభ ప్రాంగణం మేడారం జాతర వాతావరణంతో కళకళలాడింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షమ శాఖ మంత్రి ధనసరి అనసూయ, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎస్సీ, ఎస్టీ సంక్షమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్తో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులకు మేడారం మహా జాతర ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా మేడారం ఈఓ వీరస్వామి, సమ్మక్క-సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావుతో పాటు ఇతర పూజారులు ఆలయ సంప్రదాయం ప్రకారం కంకణం కట్టి, కండువా కప్పి, బంగారం అందజేసి ప్రముఖులను మహా జాతరకు ఆహ్వానించారు. మేడారం జాతర విశిష్టతను మంత్రులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. ఈ నెల 28 నుంచి 31 వరకు మేడారం మహా జాతర నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. మేడారం అభివృద్ధికి ప్రభుత్వం రూ.230 కోట్లతో విస్తృత పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ నెల 19న సమ్మక్క-సారలమ్మల గద్దెలు, ఆలయ ప్రాంగణ పునరుద్ధరణ పనుల ప్రారంభోత్సవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్నారు. సరికొత్తగా అభివృద్ధి చేస్తున్న మేడారం ఆలయ ప్రాంగణం మరో వెయ్యి సంవత్సరాల పాటు నిలిచేలా పూర్తిగా రాతి కట్టడాలతో నిర్మాణం జరుగుతోంది. సమ్మక్క-సారలమ్మల త్యాగాలు, ఆదివాసీ చరిత్ర ప్రతిబింబించేలా ద్వారాలు, ప్రహరీలు రూపకల్పన చేశారు. ఆదివాసీ సంస్కృతి, ఆధ్యాత్మికత, ఆధునికత సమ్మేళనంగా మేడారం మహా జాతరకు విస్తృత సన్నాహాలు కొనసాగుతున్నాయి. ఏటా లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే మేడారం మహా జాతరకు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖులకు అధికారికంగా ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆహ్వానం అందుకున్న ప్రముఖులు ఆదివాసీల అతిపెద్ద జాతరకు తప్పకుండా హాజరవుతామని భరోసా ఇచ్చారు.



## రిజిస్ట్రేషన్ సేవలకు కొత్త రూపం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణలో రిజిస్ట్రేషన్ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా, ప్రజానుకూలంగా మార్చే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, అందులో 94 అద్దె భవనాల్లో, 50 ప్రభుత్వ భవనాల్లో పనిచేస్తున్నాయని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 94 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నిర్మాణాలు మూడు దశల్లో చేపడతామని, ఆధునిక సదుపాయాలతో కార్పొరేట్ స్థాయి సేవలు అందించేలా రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 ఇంటిగ్రేటెడ్ క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇవి రాష్ట్ర రిజిస్ట్రేషన్ ఆదాయంలో సుమారు 69 శాతం వాటా కలిగి ఉన్నాయని వివరించారు. ఈ నెలాఖరు నాటికి 10 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం లేకుండా, ప్రైవేట్ డెవలపర్ల భాగస్వామ్యంతో అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. నిర్మాణంతో పాటు మొదటి ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతను కూడా ప్రైవేట్ డెవలపర్లే చేపడతారని చెప్పారు. అదే సమయంలో స్లాట్ బుకింగ్ విధానం అమలులోకి రావడంతో ఒక్క డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు పట్టే సమయం 18 నుంచి 21 నిమిషాలకు తగ్గిందని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రజలకు వేగవంతమైన, ఇబ్బందులేని సేవలు అందుబాటులోకి వచ్చాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

వేద న్యూస్
మంగళవారం జనవరి 06, 2026

# ‘సమ్మక్క-సారలమ్మ’ భూమిని కాపాడుతాం

- కొందరు ఆక్రమించి మొక్కలు నాటారు
- కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్



**వేద న్యూస్, కమలాపూర్:**

సమ్మక్క-సారలమ్మ జాతరకు సంబంధించిన భూమి అన్యాక్రాంతం కాకుండా మండల తహసీల్దార్‌తో మాట్లాడి భూమికి సరిహద్దులు ఖరారు చేస్తామని కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో సమ్మక్క-సారలమ్మ జాతరకు సంబంధించిన భూమి అన్యాక్రాంతం అవుతున్నదన్న ఆరోపణలపై స్థానిక ప్రజాప్రతినిధులు క్షత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. కొందరు కబ్జాదారులు జాతరకు సంబంధించిన భూమిని ఆక్రమించి మామిడి మొక్కలు నాటినట్లు గుర్తించి, ఆ ప్రాంతాన్ని పూర్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సతీష్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఎవరూ కూడా జాతరకు సంబంధించిన భూమిని కబ్జా చేయకుండా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. జాతరకు సంబంధించిన భూమి ప్రభుత్వానికి, ప్రజలకు చెందినదని, ఆ భూమిపై ఎలాంటి ప్రైవేట్ హక్కులు లేవని పేర్కొన్నారు. అక్రమంగా మొక్కలు నాటిన వారిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతామని తెలిపారు. ఇప్పటికైనా కబ్జాదారులు ఆక్రమించిన భూమిని నిరభ్యంతరంగా జాతర కమిటీకి అప్పగించి సహకరించాలని, లేకపోతే చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ క్షత్రస్థాయి పరిశీలనలో కమలాపూర్ ప్రజాప్రతినిధులతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలసాని రమేష్, తౌటం రవీందర్, వార్డు సభ్యుడు మౌటం రమేష్, గతంలో ఎన్నికైన జాతర కమిటీకి సంబంధించిన చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేకాటరాయుళ్ల అరెస్ట్

- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు - ఎస్పీ డీవీ శ్రీనివాస రావు




**వేద న్యూస్, పాపన్నపేట:**

మెదక్ జిల్లా పాపన్నపేట మండలం లింగాయపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ పోలీసులు, పాపన్నపేట పోలీస్ సిబ్బంది కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఆరుగురు పరారయ్యారు. వారి వద్ద నుంచి రూ.26,183 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తరలించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పరారైన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు మాట్లాడుతూ.. జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో తప్పు మార్గాలను ఎంచుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కష్టపడితేనే ఫలితం దక్కుతుందని, ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం వెంటనే పోలీసులకు అందించి సహకరించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# మోసం చేసి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలి

- భూమి అమ్ముతానని చెప్పి నమ్మించాడు
- 2020లో రూ.5లక్షలు తీసుకొని ఇబ్బంది పెడుతున్నాడు
- దేవాపూర్ గ్రామంలో కుటుంబంతో బాధితుల ఆందోళన




**వేద న్యూస్, కాసిపేట:**

భూమి ఇస్తామని చెప్పి మోసం చేసి తీసుకున్న రూ.20 లక్షల డబ్బులు వెంటనే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామంలో బాధితులు ఆందోళనకు దిగారు. దేవాపూర్‌కు చెందిన సీపతి రంజిత్ కుమార్ ఇంటి ఎదుట మంచిర్యాల ఎంసీసీ శ్రీనివాస కాలనీకి చెందిన చీపిరిశెట్టి సుధాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి టెంట్ వేసి ధర్నా నిర్వహించారు. బాధితుల వివరాల ప్రకారం.. 2020 సంవత్సరంలో భూమి అమ్ముతామని చెప్పి సీపతి రంజిత్ కుమార్ తమ వద్ద నుంచి రూ.20 లక్షలు తీసుకున్నాడని, అయితే ఇప్పటివరకు భూమి ఇవ్వకపోగా డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. డబ్బులు తిరిగి ఇచ్చే వరకు అక్కడి నుంచి వెళ్లబోమని స్పష్టం చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో బాధితులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. అనంతరం కాసిపేట ప్రెస్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులు చీపిరిశెట్టి సుధాకర్, అనసూర్యలు మాట్లాడుతూ... 2020లో శ్రీనివాస గార్డెన్ వద్ద భూమి ఉందని చెప్పి సీపతి రంజిత్ కుమార్ రూ.20 లక్షలు తీసుకున్నాడని తెలిపారు. డబ్బులు ఇచ్చిన సమయంలో రాయించుకున్న పత్రాలు, డబ్బులు తిరిగి ఇస్తామని రాసిచ్చిన హామీ పత్రాలు, ఒప్పంద పత్రాలను సాక్షులతో సహా చూపించారు. సింగరేణిలో పదవీ విరమణ అనంతరం వచ్చిన డబ్బులను పిల్లల భవిష్యత్తు కోసం భూమి కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో ఇచ్చామని, కానీ భూమి ఇవ్వకుండా మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందన లేదని పేర్కొంటూ, పోలీసులు, అధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ సమావేశంలో బాధిత కుటుంబీకులు కొండ వెంకటేష్, శృతి పాల్గొన్నారు.

# ముగిసిన తొలి గ్రామ సభ

- గ్రామ సమస్యలపై చర్చ




**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

రెండేళ్లుగా గ్రామాల్లో సర్పంచ్ పాలన లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని, గ్రామ పంచాయతీల్లో పేరుకుపోయిన సమస్యలు సవాళ్లుగా మారాయని గ్రామ సభలో చర్చకు వచ్చింది. ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో తొలి గ్రామ సభను గ్రామ ప్రజలతో కలిసి పంచాయతీ కార్యాలయంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సభలో సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ మాట్లాడుతూ.. రైతు భరోసా లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఇతర ప్రభుత్వ పథకాల వివరాలను గ్రామ ప్రజలకు, యువతకు వివరించారు. కొత్త రేషన్ కార్డులు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే యువత కోసం వ్యాయామశాల ఏర్పాటు, తాగునీటి సరఫరా మెరుగుదల, డ్రైనేజీ వ్యవస్థ, ప్రధాన రహదారుల అభివృద్ధి, ఊరు మురిసేలా నర్సరీ సుందరీకరణ వంటి అంశాలపై గ్రామ ప్రజలతో విస్తృతంగా చర్చించారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రజలతో కలిసి ముందుకు సాగుతామని సర్పంచ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుమ్మల జయ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, జీపీవో రాజేశం, వార్డు సభ్యులు శ్రీనివాస్, చంద్రశేఖర్, రాకేష్, దోస నవనీత, ఏఎన్ఎం భవాని, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, యువత పాల్గొన్నారు.

# సమాజానికి మానసిక ఆరోగ్యసేవలు అత్యవసరం

- డాక్టర్ రాంచందర్




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ప్రస్తుతం నేటి ఆధునిక సమాజంలో మానసిక ఆరోగ్య సేవలు అత్యవసరమని తెలం గాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.మోతుకూరి రాం చందర్ అన్నారు. వరంగల్ సైన్స్ సెంటర్లో నిర్వహించిన తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ నూతన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా అధ్యక్షుడు పోగు అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోత్కూరి రామచంద్రరావు పాల్గొన్నారు. అధ్యక్షులు సమావేశంలో మాట్లాడుతూ పెరుగుతున్న ఒత్తిళ్ల నడుమ అనేక జీవితాలు అర్ధాంతరంగా ముగుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.మానసిక ఒత్తిడితో సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్న సమయంలో సైకాలజిస్ట్ ల పాత్ర కీలకమన్నారు. ముఖ్యంగా నేటి యువతరం విద్యార్థులు మరియు ప్రజలు అనేక రకాల మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటూ సర్దుబాటు చేసుకోలేక జీవితాన్ని ముగించాలనే ధోరణలు ఎక్కువ అవుతున్న ఈ తరుణంలో తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ పాఠశాలలు కళాశాలలు మరియు వివిధ సమూహాలలో సమావేశాలు నిర్వహించి మానసిక ఆరోగ్యము గురించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు అని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీధర్ రావు జిల్లా అధ్యక్షుడు పోగు అశోక్,జనరల్ సెక్రటరీ శ్రీలత,ఉపాధ్యక్షుడు బొజ్జ సురేశ్,హరీష్, భారత, అశోక్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ‘పాలమూరు-రంగారెడ్డి’పై విచారణకు సంకేతాలు

- జూరాలా నుంచి శ్రీశైలం మార్పుపై అనుమానాలు
- అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం
- పారదర్శకత, బాధ్యతాయుత ఖర్చులే లక్ష్యం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో చోటుచేసుకున్న అక్రమాల పై త్వరలోనే విచారణకు ఆదేశాలు ఇవ్వనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి కీలక సంకేతాలు ఇచ్చారు. ఈ పథకానికి సంబంధించి నీటి మూలాన్ని జూరాలా నుంచి శ్రీశైలానికి మార్చిన అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ రూపకల్పనలో జరిగిన మార్పులు, వ్యయభారం పెరగడానికి కారణమైన నిర్ణయాలపై స్పష్టత అవసరమని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ప్రజాధనాన్ని బాధ్యతాయుతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని, గతంలో తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్రానికి ఎంత నష్టం వాటిల్లిందో ప్రజలకు తెలియాల్సి ఉందని సీఎం పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ తెలంగాణలో కీలక సాగునీటి పథకంగా భావించబడుతున్న నేపథ్యంలో, ఇందులో జరిగిన ప్రతి అంశాన్ని పారదర్శకంగా పరిశీలిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తప్పవని సంకేతాలు ఇచ్చింది. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వానికి పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజాధన పరిరక్షణ పట్ల ఉన్న నిబద్ధత స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. విచారణ ఆదేశాలు జారీ అయితే, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ వ్యవహారం మరోసారి రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారే అవకాశం కనిపిస్తోంది.

# సర్వభ్రష్ట బీఆర్ఎస్..

- తెలంగాణను సర్వనాశనం చేసింది
- పద్ధతి, ప్రజాస్వామ్యం, నైతికత లేని పార్టీ
- అధికారంలోనూ, ప్రతిపక్షంలోనూ ఘోర వైఫల్యం
- అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై కవిత తీవ్ర విమర్శలు



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

బీఆర్ఎస్ పార్టీ తెలంగాణను సర్వనాశనం చేసిన సర్వభ్రష్ట రాజకీయ శక్తిగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆమె, బీఆర్ఎస్‌కు పద్ధతి లేదని, ప్రజాస్వామ్య విలువలు లేవని, నైతికత పూర్తిగా క్షణించిందని ఆరోపించారు. అవినీతినే ఎజెండాగా పెట్టుకుని పాలన సాగించిన పార్టీ బీఆర్ఎస్ అని కవిత మండిపడ్డారు. అడుగడుగునా తెలంగాణకు ద్రోహం చేశారని, పదేళ్ల పాలనలో రాష్ట్రానికి శాశ్వతంగా ఉపయోగపడే ఒక్క బలమైన పునాది కూడా వేయలేకపోయారని విమర్శించారు. అధికారపక్షంగా పూర్తిగా ఫెయిల్ అయిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంగా కూడా ప్రజల సమస్యలపై పోరాడలేక పోతోందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆశలు, ఆకాంక్షలను తుంగలో తొక్కిన పార్టీగా బీఆర్ఎస్ చరిత్రలో మిగిలిపోతుందని కవిత అన్నారు. ప్రజాస్వామ్యం, విలువలు, బాధ్యత లేని రాజ కీయాల వల్లే రాష్ట్రం ఎన్నో నష్టాలు చవిచూసిందని తెలి పారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధంగా బీఆర్ఎస్ పాలన సాగిందని ఆమె విమర్శించారు. మొత్తంగా బీఆర్ఎస్ ఒక సర్వభ్రష్ట పార్టీగా ప్రజల ముందుకు బహిర్గత మైందని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల తరఫున నిజాలను బయటపెట్టడమే తన బాధ్యత అని, ప్రజల ఆత్మ గౌరవం కోసం పోరాటం కొనసాగుతుందని అసెంబ్లీలో స్పష్టమైన సందేశం ఇచ్చారు.

# యువకుడిని కాపాడిన మిల్స్ కాలనీ పోలీసులు



**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

దేశాయిపేట ప్రాంతానికి చెందిన మంద వినోద్ అనే యువకుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా సోమవారం వరంగల్లోని రైల్వే ట్రాక్ పై ఆత్మహత్య యత్నంకు ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు చెందిన కానిస్టేబుల్ సంతోష్ రెడ్డి, మహిళా కానిస్టేబుల్ రాధిక సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు సిద్ధపడిన యువకుడికి పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో శభాష్ పోలీస్ అంటూ పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

వేద న్యూస్

మంగళవారం జనవరి 06, 2026

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



**వేద న్యూస్, కాసిపేట:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాసిపేట మండలంలోని తాటి గూడ గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాటా ్లడి, ఇళ్ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సిమెంట్‌తో పాటు ఇతర నిర్మాణ సామగ్రిని సరైన మోతాదులో వినియోగించాలని మేస్త్రీలు, లబ్ధిదారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్న లబ్ధిదారులకు ప్రభుత్వ నిధులు సకాలంలో అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అలాగే ఇసుక కొరత లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పంచాయతీ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎండాకాలం లోపే ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి గృహప్రవేశాలు చేసుకునేలా లబ్ధిదారులు కృషి చేయాలని సూచించారు. పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలవుతోందని, గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా, సకల సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా తాము నిరంతరం పర్య వేక్షిస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి మౌలిక, కాంగ్రెస్ పార్టీ నాయకులు చుంచు జనార్ధన్, ముత్యం రాజయ్య, కరోబారి శ్రావణ్ పాల్గొన్నారు.

# ఘనంగా అలామా అబాకస్ పోటీలు




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

21వ అంతర్జాతీయ స్థాయి అలామా అబాకస్ పోటీలు సికింద్రాబాద్ హర్యానా భవన్లో ఘనంగా నిర్వహించారు. పోటీలో గెలిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. వరంగల్ ట్రై సిటీస్ కి చెందిన చెందిన స్టూడెంట్స్ 1-8 లెవెల్స్ లో పాల్గొని వివిధ కేటగిరీల్లో బహుమతులు గెల్చుకున్నారు. నగరానికి చెందిన అనుమసా ఆదిత్య లెవెల్ 4 విభాగంలో 5 నిమిషాల్లో 70 కీ పైగా సం చేసి ఛాంపియన్ ట్రోఫీని గెలుచు కున్నారు. ఇరుగు అభినయ శ్రీ. దేవాన్ష్, రాజారామ్, అభిరామ్, ఆర్యన్ రామ్, శ్లోఖా,ఆన్లైన్ ఆఫ్లైన్ మోడ్స్ లో గెలుపొంది బహుమతులు గెలుచుకొన్నారు. అలమ అబాకాస్ ఇంటర్నేషనల్ ఫౌండర్ పద్మావతి, ముట్టు కుమార్ మోటివేషనల్ స్పీకర్ నాగప్రసాద్, అవకాస్ మాస్టర్ నరేష్ గుప్తా పలువురు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా నరేష్ గుప్తా మాట్లాడుతూ గత 18 సంవత్సరాల నుంచి వరంగల్ ట్రైన్ సిటీ నుండీ స్టూడెంట్స్ క్రమం తప్పకుండ పాల్గొంటున్నారని తెలిపారు.

# కరెంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం




**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామ పంచాయతీలో ఎర్తింగ్ సమస్య కారణంగా లో వోల్టేజ్ ఏర్పడి గ్రామంలో విద్యుత్ అంతరాయం నెలకొంది. ఈ సమస్యపై గ్రామ ప్రజల నుంచి విజ్ఞప్తులు అందడంతో, శాశ్వత పరిష్కారంగా ఎర్తింగ్ కోసం నల్లా కనెక్షన్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇచ్చిన హామీ మేరకు ఈ పనిని అదే రోజు సాయంత్రం వరకు పూర్తి చేసి నల్లా కనెక్షన్ ఏర్పాటు చేశారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ అవినాష్ మాట్లాడుతూ.. ఇకపై గ్రామంలో ఎర్తింగ్ సమస్యతో పాటు కరెంట్ సమస్యలు ఉండవని గ్రామ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి సహకరించిన అశోక్‌కు, గ్రామ కార్మికులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉప్పు శంకరప్ప, గ్రామ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# వైర్‌లెస్ బ్లూటూత్ స్పీకర్ వితరణ



**వేద న్యూస్, చొప్పదండి:**

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం చొప్పదండి పట్టణ అధ్యక్షుడు వడ్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో, కోలపూరి రమేష్ తన తండ్రి కీశే. కోలపూరి హన్మయ్య జ్ఞాపకార్థంగా వైర్‌లెస్ బ్లూటూత్ ఫోర్టబుల్ 50 వాట్స్ స్పీకర్ (ఛార్జింగ్ సౌండ్ బాక్స్)ను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం చొప్పదండి పట్టణ శాఖకు బహూకరించారు. ఈ స్పీకర్ విలువ రూ.17,500 ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా సంఘం తరఫున కోలపూరి రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కడారి గంగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి చింటూ, అంజయ, మహేష్ (మాజీ కౌన్సిలర్), బిజిలి కనకయ్య, శంకర్, శ్రీనివాస్, రాజలింగం, సుధాకర్, వాసు, మాచర్ల లక్ష్మణ్, భూమేష్, అనిల్, మహేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ విరాళం ద్వారా సంఘ కార్యకలాపాలకు మరింత తోడ్పాటు లభిస్తుందని సంఘ నాయకులు పేర్కొన్నారు.

# 8వ వార్డులో పారిశుద్ధ్య పనులు



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని 8వ వార్డు అంబం గల్లీలో సోమవారం పారిశుద్ధ్య పనులు చురుగ్గా కొనసాగాయి. ఎనిమిదవ వార్డు మెంబర్ బొజగొండ అనీల్ స్వయంగా పర్యవేక్షిస్తూ గ్రామపంచాయతీ సిబ్బందితో పారిశుధ్య పనులు చేయించారు. ఉర్దూ మీడియం స్కూల్ గల్లీతో పాటు శ్రీ రాజరాజేశ్వరి ఆలయం వైపు డ్రైనేజీలో చెత్త చెదారం పేరుకుపోవడంతో, డ్రైనేజీలను పూర్తిగా శుభ్రం చేయించారు. దీంతో పరిసర ప్రాంతాలు శుభ్రంగా మారి, దుర్వాసన తగ్గడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగిస్తామని, వార్డు ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని వార్డు సభ్యుడు తెలిపారు.

# ఖమ్మం బహిరంగ సభను విజయవంతం చేయాలి



**– సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లక్ష్మణ్**

**వేద న్యూస్, కాసిపేట:**

సీపీఐ 100 సంవత్సరాల చరిత్రను పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీన ఖమ్మం జిల్లాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. ప్రచార బస్ యాత్ర మూడో రోజు కాసిపేట మండలంలోని యాప గ్రామంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని, కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం పార్టీ ముందుండి ఉద్యమిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఖమ్మంలో జరగనున్న బహిరంగ సభ సీపీఐ భవిష్యత్ పోరాటాలకు దిశానిర్దేశం చేయనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల దాసు, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, బొల్లం పూర్ణిమ, బొంతల లక్ష్మీనారాయణ, గట్టు సర్వేశం, శాలిగామ సంతోష్, జాడి పోచం, కోవలింగు, కొండ్రు బానేష్, బియ్యాల ఉపేందర్, బోర్లగుంట విజయలక్ష్మి, తిరుమల కొంకుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువతి చదువు కోసం విద్య ఫౌండేషన్ ఆర్థిక సహాయం



**వేద న్యూస్, చొప్పదండి :**

చొప్పదండి మండలంలోని ఆర్నకొండ గ్రామానికి చెందిన మ్యాకల ప్రవళిక బి.ఫార్మసీ చదువుతోంది. తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవడంతో తాత, నానమ్మల వద్ద ఉంటూ చదువును కొనసాగిస్తోంది. పదో తరగతిలో కస్తూర్బా స్కూల్‌లో 10 జీపీఏ సాధించిన ప్రవళిక, ఇంటర్మీడియట్‌లో 920 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో పదివేల లోపు ర్యాంకుతో బి.ఫార్మసీలో ఫ్రీ సీటు వచ్చినప్పటికీ, హాస్టల్ ఫీజు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఆర్థిక సహాయం కోసం విద్య ఫౌండేషన్ ను సంప్రదించింది. ఫౌండేషన్ సభ్యులు ఆర్నకొండకు వెళ్లి కుటుంబ పరిస్థితిని పరిశీలించి చదువు పూర్తయ్యేలా ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. దాతల సహకారంతో గతంలో మొదటి రెండు సెమిస్టర్ల కోసం రూ.35,502, తదుపరి రెండు సెమిస్టర్ల కోసం రూ.36,155 అందజేశారు. తాజాగా మరో సెమిస్టర్ల కోసం రూ.52,500 సేకరించి అందించారు. ఇప్పటివరకు మొత్తం రూ.1,24,157 ఆర్థిక సహాయం అందించినట్లు ఫౌండేషన్ పేర్కొంది. ఈ మొత్తంతో ప్రవళిక చదువు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్య ఫౌండేషన్ చైర్మన్ పచ్చునూరి తిరుపతి మాట్లాడుతూ.. ఒక అనాథ అమ్మాయి చదువు పూర్తయ్యేలా సహకరించిన దాతలందరికీ సంస్థ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మాయి బాబాయి రామకృష్ణతో పాటు ఫౌండేషన్ సభ్యులు పైడా మహేష్, సామల వెంకటేష్, కటుకం నారాయణ, వల్లాల జగన్, వెంకటేశం బొద్దుల, శేఖర్ సిరిపురం తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్లు భౌగోళికంగా సవరించాలి

**– పూలే బీసీ సంక్షమ సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి**



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరపాలక సంస్థలో నూతనంగా ఏర్పాటు చేసిన డివిజన్ల విభజన భౌగోళికంగా అస్తవ్యస్తంగా ఉందని, వాటిని సవరించాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు పూలే బీసీ సంక్షమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి అయిలన్న కురుమ, జాతీయ బీసీ సంక్షమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగుర్ల శ్రీనివాస్ కురుమ ప్రజావాణిలో విన్నవించారు. ప్రస్తుత విభజనలో ఒకే రోడ్డు రెండు డివిజన్లలోకి రావడం వల్ల మున్సిపల్ వాటర్ పైప్‌లైన్లు, స్ట్రీట్ లైట్లు, పారిశుధ్య పనులు, రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాదు, పరిపాలనపరంగా కూడా ప్రజలకు అవగాహన లోపాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. కావున ఒక రోడ్డు ఇరువైపులా ఉన్న ఓటర్లు ఒకే డివిజన్‌లోకి వచ్చే విధంగా డివిజన్లను భౌగోళికంగా సవరించాలని కోరారు. ఇలా సవరణ చేస్తే పరిపాలనా సౌలభ్యం మెరుగుపడటంతో పాటు, కార్పొరేటర్లకు కూడా అభివృద్ధి పనులు సమర్థవంతంగా నిర్వహించడానికి అనుకూలంగా ఉంటుందని వారు సూచించారు.

# పాకాల అభయారణ్యంలో ఘనంగా జాతీయ పక్షుల దినోత్సవం




**వేద న్యూస్, పాకాల / నర్సంపేట:**

- పక్షుల పరిరక్షణపై పాఠశాల విద్యార్థులకు అవగాహన
- వరంగల్ అటవీ శాఖ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం

జాతీయ పక్షుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పాకాల అభయారణ్యంలో వరంగల్ అటవీ శాఖ, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ (ఔల్స్) సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పక్షులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాకాల అభయారణ్యంలోని పక్షుల జీవవైవిధ్యం, వాటి ఆవాసాల పరిరక్షణ మరియు స్థానిక జీవజాతుల విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి ఏటా శీతాకాలంలో పాకాల సరస్సుకు విదేశాల నుండి వచ్చే వివిధ రకాల వలస పక్షుల గురించి మరియు పాకాల సరస్సు యొక్క పర్యావరణ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేటలోని మదర్స్ ల్యాండ్ పాఠశాలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పక్షుల పట్ల ఆసక్తిని పెంచేందుకు విద్యార్థులకు ః బర్డ్స్ ఆఫ్ తెలంగాణః అనే ఛాయాచిత్రాల పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రకృతిలో పక్షుల పాత్ర అత్యంత కీలకమని, వాటి ఆవాసాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. భావి తరాలకు పర్యావరణంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. కార్యక్రమంలో ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ అధ్యక్షులు ఇందారం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చెలుపూరి శ్యామ్ సుందర్ శర్మ, సంయుక్త కార్యదర్శి పిట్టల రవిబాబు, అటవీశాఖ అధికారి ధర్మ, పాఠశాల ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ




**వేద న్యూస్, ఆందోల్ :**

టేక్మాల్ మండల విద్యాధికారి సుజాత మరియు జిల్లాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా సోమవారం నాడు టేక్మాల్ మండల వనరుల కేంద్రం( ఎం ఆర్ సి )నందు (టిఎస్ యు టిఎఫ్) ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ మరియు డైరీని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ టేక్మాల్ అధ్యక్షులు నాచారం శేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలలో టి ఎస్ యు టి ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. క్యాలెండర్ మరియు డైరీలు ఉపాధ్యాయులకు దైనందిన పనిలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అదేవిదంగా 2010తర్వాత నియమితులైన ఉపాధ్యాయుల కు మినహాయింపు ఇవ్వాలి.పెండింగ్ డి ఏ లను ప్రకటించాలని మరియు పి ఆర్ సి ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాచారం శేఖర్,రాజు,వినోద్, రూపకళ,మల్లేశం, యాదగిరి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం జనవరి 06, 2026

# స్పోర్ట్స్ పాలసీని పకడ్బందీగా అమలు చేయాలి

**– ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**

**వేద న్యూస్, హైదరాబాద్ :**



తెలంగాణ రాష్ట్రంలో స్పోర్ట్స్ పాలసీని కేవలం ప్రకటించడమే కాకుండా పకడ్బందీగా అమలు చేయాలని బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ప్రారంభమైన శాసనసభ సమావేశాల్లో భాగంగా శాసనమండలిలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాలను ప్రస్తావించారు.రాష్ట్రంలోని సర్కారు పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో చాలా చోట్ల ప్లే గ్రౌండ్స్ లేవని, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దాదాపు 200 పాఠశాలలను సందర్శించినట్లు తెలిపారు. అనేక పాఠశాలల్లో విద్యార్థులు ఆటలాడేందుకు సరైన మైదానాలు, అవసరమైన మౌలిక వసతులు లేవని సభ దృష్టికి తీసుకువచ్చారుకేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఖేల్ ఇండియా' పథకం తరహాలో తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చినప్పటికీ, దాని అమల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి స్పోర్ట్స్ పాలసీని సమర్థవంతంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, యువతకు చదువుతో పాటు ఆటలు కూడా ఎంతో ముఖ్యమని, క్రీడల్లో రాణించినవారు చదువుల్లోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. రాష్ట్రంలోని సర్కారు పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టులను వెంటనే భర్తీ చేస్తే విద్యార్థులు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించిన క్రీడాకారులను గుర్తించి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని గుర్తు చేశారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్స హిస్తే, భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం దేశం పేరును అంతర్జాతీయ క్రీడారంగం లో నిలబెట్టగలదని తెలిపారు. ప్రతి మండలం, నియోజకవర్గం లో అవసరమైన చోట క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ వంటి క్రీడలకు ప్రత్యేక మైదానాలు, స్టేడియాలు నిర్మించాలని కోరారు. 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రాన్ని 'ఖేల్ తెలంగాణ'గా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. క్రీడలు యువతకు పేరు, ప్రఖ్యాతలతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యం, స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తాయని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా క్రీడలకు అవసరమైన వసతులు కల్పించి క్రీడలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సూచిస్తున్నట్లు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య తెలిపారు.

# ఆక్వాకల్చర్ రంగానికి చారిత్రక ముందడుగు

**రంగారెడ్డి, వేద న్యూస్ :**



తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో దేశంలోనే తొలి వాణిజ్య స్థాయి ట్రాపికల్ రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఫారం మరియు పరిశోధనా కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, డైరీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతతో కూడిన ఆక్వాకల్చర్ ప్రాజెక్టులు తెలంగాణ రాష్ట్రానికి కొత్త అవకాశాలను తెస్తాయని పేర్కొన్నారు. ఖచ్చితమైన ఇంజినీరింగ్, నియంత్రిత జీవ వ్యవస్థలు, ఆధునిక నీటి పునర్వినియోగ సాంకేతికతలతో రూపొందిన ఈ కేంద్రం ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా ఉందని తెలిపారు. ఎఈ కేంద్రం యువతకు ప్రత్యక్ష శిక్షణ, ప్రదర్శన కేంద్రంగా పనిచేస్తూ, అధునాతన ఆక్వాకల్చర్ వ్యవస్థలు, ఆటోమేషన్, బయోసెక్యూరిటీ అంశాల్లో ప్రాయోగిక అనుభవం అందించనుందని వివరించారు. దీని ద్వారా మత్స్యరంగంలో మానవ వనరుల నైపుణ్యం పెరిగి, ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని అన్నారు. తెలంగాణలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత శక్తివంతం చేయడంలో ఇలాంటి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కూడా గణనీయమైన ప్రోత్సాహం అందిస్తాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు

# ఎపిఫనీ దినోత్సవం

## దర్శనంగా మారిన విశ్వాసరౌ మానవత్వానికి దారి చూపిన రోజు

**వేద న్యూస్ డెస్క్:**

క్రైస్తవ సంప్రదాయంలో ఎపిఫనీ దినోత్సవానికి ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక గౌరవం ఉంది. ఇది కేవలం ఒక పండుగ కాదు, ఒక ఆలోచన, ఒక దృష్టికోణం. యేసు క్రీస్తు జననం తరువాత, తూర్పు దేశాల నుంచి వచ్చిన ముగ్గురు జ్ఞానులు ఆయనను దర్శించిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ ఈ రోజును పాటిస్తారు. దేవుడు తనను తాను సమస్త మానవాళికి పరిచయం చేసిన దినంగా ఈ ఎపిఫనీని విశ్వసిస్తారు. ఎపిఫనీ అనే పదానికి అర్థం 'ప్రకటన' లేదా 'దర్శనం'. అంటే, యేసు క్రీస్తు కేవలం ఒక చిన్న గ్రామానికి, ఒక జాతికి పరిమితుడు కాదని, ప్రపంచమంతటికీ వెలుగుగా నిలుస్తాడని తెలియజేసిన రోజు ఇది. యూదులకు మాత్రమే కాదు, అన్యజనులకు కూడా ఆయన ఆశాకిరణమని ఈ సంఘటన ప్రతీకగా నిలుస్తుంది.

**– నక్షత్రాన్ని అనుసరించిన విశ్వాసం**

ముగ్గురు జ్ఞానులు ఒక నక్షత్రాన్ని అనుసరించి దీర్ఘ ప్రయాణం చేసి శిశు యేసును చేరుకున్నారు. ఆ నక్షత్రం కేవలం ఆకాశంలో మెరిసిన వెలుగు కాదు. అది విశ్వాసానికి, ఆశకు, అన్వేషణకు ప్రతీక. జీవితంలో దారి తెలియక చీకట్లో ఉన్నప్పుడు, ఒక వెలుగు కోసం వెతకాల్సిందే అన్న సందేశాన్ని ఈ సంఘటన మనకు ఇస్తుంది. విశ్వాసం అనేది మూఢనమ్మకం కాదు, అది నిజాన్ని వెతికే ధైర్యం అని ఎపిఫనీ గుర్తు చేస్తుంది.

**– కానుకల వెనుక ఉన్న అర్థం**

జ్ఞానులు తీసుకొచ్చిన బంగారం, లోబాన్, మిర్రు సాధారణ కానుకలు కావు. బంగారం ఆయన రాజత్వాన్ని సూచిస్తే, లోబాన్ ఆయన దైవత్వానికి ప్రతీక. మిర్రు మాత్రం ఆయన మానవత్వాన్ని, భవిష్యత్తులో ఎదుర్కొనే బాధలను సూచిస్తుంది. ఈ మూడు కానుకలు యేసు జీవితం మొత్తం దిశను ముందుగానే తెలియజేసినట్లుగా భావిస్తారు. ఆనందం, త్యాగం, బాధౌ ఈ మూడు మానవ జీవితంలోని విడదీయలేని భాగాలని ఎపిఫనీ ద్వారా చర్చిలో బోధిస్తారు.

**– ప్రపంచవ్యాప్తంగా పండుగగా**

పలు దేశాల్లో ఎపిఫనీ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరుపుకుంటారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, కీర్తనలు, దీపాల వెలుగులో జరిగే సేవలు ఈ రోజుకు ప్రత్యేకతను తీసుకొస్తాయి. కొన్ని దేశాల్లో ఊరేగింపులు, సంప్రదాయ నాటకాలు నిర్వహిస్తారు. పిల్లలకు బహుమతులు ఇవ్వడం, కుటుంబ సమేతంగా వేడుకలు జరుపుకోవడం ద్వారా ఈ దినం ఆనందాన్ని పంచుతుంది.

**– నేటి సమాజానికి ఇచ్చే సందేశం**

ఎపిఫనీ దినోత్సవం ఒక మతపరమైన ఆచారంగా మాత్రమే పరిమితం కావాల్సిన రోజు కాదు. ఇది విభజనలతో నిండిన నేటి సమాజానికి ఒక బలమైన సందేశం ఇస్తుంది. జాతి, మతం, దేశం అనే గోడల్ని దాటి ప్రేమ, ఐక్యత, మానవత్వం ముఖ్యమని చెబుతుంది. శాంతి అనేది మాటల్లో కాదు, మన ప్రవర్తనలో కనిపించాలన్న బోధనను అందిస్తుంది.

**– చీకట్లో వెలుగు కావాల్సిన కాలం**

యుద్ధాలు, హింస, ద్వేషం పెరుగుతున్న ఈ కాలంలో ఎపిఫనీ దినోత్సవం ప్రాముఖ్యత మరింత పెరిగింది. చీకట్లో ఒక చిన్న వెలుగు కూడా మార్గం చూపగలదని ఈ రోజు గుర్తు చేస్తుంది. ఆ వెలుగు ప్రతి మనసులో వెలిగితేనే సమాజం మారుతుంది. ఇతరులను అర్థం చేసుకోవడం, అవసరంలో ఉన్నవారికి చేయూత ఇవ్వడం, ప్రేమను పంచడం ఉ ఇవే ఎపిఫనీ యొక్క నిజమైన ఆచరణ.ఎపిఫనీ అంటే కేవలం గతంలో జరిగిన ఒక దర్శనం కాదు. అది ఈ రోజుకీ, రేపటికీ అవసరమైన దృష్టి. ప్రతి మనిషి తనలోని వెలుగును గుర్తించి, మరొకరికి దారి చూపినప్పుడే ఈ దినోత్సవం సార్థకమవుతుంది.

# రూ.300 కోట్ల డీల్‌ను తిరస్కరించిన విరాట్


**వేద న్యూస్ డెస్క్:**



భారత క్రికెట్‌లో తన ఆటతోనే కాదు, తన నిర్ణయాలతో కూడా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విరాట్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఎనిమిదేళ్లపాటు ఒక అంతర్జాతీయ క్రీడా దుస్తుల సంస్థ కు బ్రాండ్ ప్రతినిధిగా కొనసాగిన ఆయన, ఆ ప్రయాణానికి ముగింపు పలికారు. ఈ సందర్భం గా దాదాపు రూ. 300 కోట్ల విలువైన ఒప్పందాన్ని కూడా తిరస్కరించడం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో విరాట్ ఒక భారతీయ క్రీడా దుస్తుల స్టార్టప్‌లో పెట్టుబడిదారుగా చేరినట్టు సమాచారం. ఈ సంస్థ విలువ ప్రస్తుతం సుమారు రూ. 2058 కోట్లుగా అంచనా వేయబడుతోంది. దేశీయ తయారీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావడం, దీర్ఘకాలిక లాభాలను సాధించడం, క్రీడా రంగంలో తనదైన ముద్ర వేయాలన్న ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని సమీప వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే విరాట్‌కు చెందిన పలు విజయవంతమైన బ్రాండ్‌లు మార్కెట్‌లో ఉన్నాయి. వాటితో పాటు తాజాగా కొత్త సంస్థలో భాగస్వామిగా మారడం ద్వారా తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించారు. ఒకప్పుడు ప్రకటనల కోసం ఆడే స్థాయి నుంచి, ఇప్పుడు బ్రాండ్‌లను నిర్మించే స్థాయికి ఎదిగిన వ్యక్తిగా ఆయనను అభిమానులు ప్రశంసిస్తున్నారు. డబ్బు కంటే దేశీయ వృద్ధి, దీర్ఘకాలిక విజయం ముఖ్యమని మరోసారి నిరూపించిన విరాట్ నిర్ణయం యువతకు ఆదర్శంగా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారీ ఆఫర్‌ను వదులుకుని భారతీయ సంస్థలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఆయన తన ఆలోచనా విధానాన్ని స్పష్టంగా చాటిచెప్పారని క్రీడా లోకం భావిస్తోంది.

# రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా రవీంద్ర జడేజా..?

**వేద న్యూస్ డెస్క్:**



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌కు ముందే రాజస్థాన్ రాయల్స్ జట్టులో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా జట్టుకు కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశముందని క్రికెట్ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. ఇటీవల రాజస్థాన్ రాయల్స్ సోషల్ మీడియా వేదికగా చేసిన ఓ పోస్ట్ ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. మరోవైపు జట్టు తమ సొంత మైదానం జైపూర్‌ను తాత్కాలికంగా పక్కనపెట్టి, కొన్ని హోమ్ మ్యాచ్‌లను పుణెలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్‌తో కొనసాగుతున్న విభేదాల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గత సీజన్‌లో ఫ్రాంచైజీపై చేసిన ఆరోపణలు పెద్ద వివాదానికి దారితీయగా, వాటిని జట్టు యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. ప్రస్తుతం అసోసియేషన్‌ను తాత్కాలిక కమిటీ నడుపుతుండటం కూడా ఈ మార్పులకు కారణంగా మారింది. ఇప్పటికే పుణె స్టేడియాన్ని పరిశీలించిన రాజస్థాన్ రాయల్స్ ప్రతినిధులు అక్కడి సౌకర్యాలపై సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. బీసీసీఐ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో జడేజా నాయకత్వంపై ఫ్యాన్స్‌లో ఆసక్తి మరింత పెరిగింది.

# నయనతారపై తమిళ ప్రేక్షకుల ఆగ్రహం

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్‌లో ప్రస్తుతం స్టార్ నటి నయనతార కేంద్రంగా పెద్ద చర్చ నడుస్తోంది. దాదాపు పదేళ్లుగా సినిమా ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్న నయనతార, మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా కోసం మాత్రం ప్రచారాల్లో పాల్గొనడం తమిళ సినీ వర్గాల్లో అసంతృప్తిని రేత్తించింది. న్యూ ఇయర్ సందర్భంగా దర్శకుడు అనిల్ రావిపూడితో కలిసి విడుదలైన ప్రచార వీడియోలో నయనతార సరదాగా కనిపించడం, స్వయంగా ప్రచారాల గురించి మాట్లాడటం కోలీవుడ్‌లో చర్చకు దారి తీసింది. తమిళంలో అగ్ర హీరోలతో నటించినప్పటికీ, తన సొంత కథనాయిక ప్రధాన చిత్రాలకు కూడా ప్రచారాలకు రాని నయనతార, తెలుగు సినిమా కోసం ఇలా ముందుకు రావడాన్ని తమిళ ప్రేక్షకులు, నిర్మాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. సోషల్ మాధ్యమాల్లో ఆమెపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమిళ సినిమాలను తక్కువగా చూస్తున్నారనే భావనతో కొందరు ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. టాలీవుడ్ పట్ల ప్రత్యేక ఆసక్తి చూపుతూ కోలీవుడ్‌ను పక్కన పెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్ కీలక పాత్రలో నటిస్తుండగా, సంక్రాంతి కానుకగా జనవరి 12న సినిమా విడుదల కానుంది. అయితే విడుదలకు ముందే నయనతార ప్రచారాల అంశం రెండు ఇండస్ట్రీల మధ్య చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం భవిష్యత్తులో ఆమె తమిళ చిత్రాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది.

# ప్రేమ కథ చిత్రంతో అసలు పోలికే ఉండదు..

## ప్రభాస్ రాజాసాబ్‌పై మారుతి ఇంట్రెస్టింగ్ కామెంట్స్

**వేద న్యూస్ డెస్క్:**




గ్లోబల్ స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న రాజాసాబ్ సినిమా గురించి దర్శకుడు మారుతి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో హారర్ కామెడీ నేపథ్యంతో రూపొందుతున్నప్పటికీ, గతంలో వచ్చిన ప్రేమ కథ చిత్రం తరహా సన్నివేశాలు ఇందులో అసలు ఉండవని ఆయన స్పష్టం చేశారు. ప్రేమ కథ చిత్రంలోని కొన్ని భయానక సన్నివేశాలు ఇప్పుడు కాలం చెల్లినవని, అలాంటి సీన్లను రాజాసాబ్‌లో పునరావృతం చేయబోమని మారుతి తెలిపారు. రాజాసాబ్‌లో హారర్ అంశాలు పూర్తిగా కొత్త ఫీల్ ఇచ్చేలా ఉంటాయని, దెయ్యాలు, హఠాత్తుగా భయపెట్టే సన్నివేశాలు, హారర్‌కు సంబంధించిన హాస్య గ్యాగ్స్ అన్నీ తాజా ఆలోచనలతో రూపొందించామని చెప్పారు. ఏ పాత సినిమాలనూ ఆదర్శంగా తీసుకోకుండా, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా కథనాన్ని తీర్చిదిద్దామని వివరించారు. ఫాంటసీ అంశాలతో పాటు హారర్‌ను మేళవించి సినిమా మొత్తం సర్‌ప్రైజింగ్‌గా సాగుతుందని తెలిపారు. ఇటీవల ఓ చిట్‌చాట్‌లో మాట్లాడిన మారుతి, ఈ సినిమా క్లైమాక్స్ దాదాపు ముప్పై ఐదు నుంచి నలభై నిమిషాల పాటు ఉంటుందని వెల్లడించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. పాట అనంతరం క్లైమాక్స్ మొదలవుతుందని, ఆ భాగంలో కథకు సంబంధించిన కీలక మలుపులు, యాక్షన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉంటాయని చెప్పారు. ఎక్కడా సాగదీత లేకుండా, ప్రేక్షకులు కథలో పూర్తిగా లీనమయ్యేలా ఈ భాగం రూపొందిందని తెలిపారు. సంక్రాంతి కానుకగా జనవరి తొమ్మిదిన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్న రాజాసాబ్ ప్రమోషన్లలో ప్రభాస్, మారుతి బృందం బిజీగా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్లకు మంచి స్పందన లభిస్తోంది. ప్రభాస్ సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులకు విజువల్ ట్రీట్ ఇస్తున్నాడని సినీ వర్గాలు చెబుతున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రంపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073